తాగునీటి ఎద్దడి రానియొద్దు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏకగ్రీవ తీర్మానం



పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

పాన్‌గల్: వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ మాట్లాడుతుండగా పలువురు సభ్యులు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపుల లీకేజీలను అరికట్టాలని, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పశు వైద్యాధికారి డా.శ్యామ్ పశుసంవర్ధక శాఖపై నివేదికను చదువుతుండగా శాగాపూర్ ఎంపీటీసీ సుబ్బయ్య మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ త్వరగా చేపట్టాలన్నారు. రెండవ విడత గొర్రెలకు డీడీలు తీసిన అర్హులకు డీడీ డబ్బులను వాపస్ ఇచ్చామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తెలియపరుస్తామని పశువైద్యులు పేర్కొన్నారు.

కాల్వలకు మరమ్మతు అవసరం

మైనర్ ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతుండగా పలు గ్రామాల్లో సాగునీటి కాల్వలకు మరమ్మతు చేపట్టాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పీఆర్ ఏఈ రమణ మాట్లాడుతుండగా జీపీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, జీపీలకు వచ్చే నిధులను కోతలు లేకుండా విడుదల చేయాలని పాన్‌గల్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు జింక్ అందుబాటులో ఉంచాలని పలువురు సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులు సమావేశాలకు సకాలంలో రావడం, సమావేశానికి ముందు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలను అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆయా శాఖల అధికారులకు సూచించారు.

బిల్లులు చెల్లించాలని వినతి

గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని, సర్పంచ్‌ల పదవీకాలాన్ని పొడిగించాలని కోరుతూ తీర్మానం చేయాలని సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. ఈనెల చివరితో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండటంతో సర్పంచ్‌లను శాలువా, పూల మాలలతో సన్మానించారు. సమావేశంలో కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఆర్‌ఐ మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి నిర్వహణపై సమావేశం



వీపనగండ్ల: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో అందిస్తున్న తాగునీటిపై బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ తాగునీరు అందుతున్న గ్రామాల్లో సంబంధిత అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ జరుపుతూ నీటి అవసరాలకు అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. నీటి సరఫరాలో తలెత్తే సమస్యలను సంబంధిత అధికారులకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, మిషన్ భగీరథ ఏఈలు దేవన్న, రామాంజనేయులు, మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఏపీఓ శేఖర్‌గౌడ్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య



పాన్‌గల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందాలని అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోస్త్ అడ్మిషన్లల్లో దరఖాస్తు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, కోర్సుల వివరాలు, అందిస్తున్న వసతులను వివరించారు. దోస్త్‌లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి, అధ్యాపకులు శ్రీనివాసులు, కొంకలగట్టయ్య, ఎండీ పాషా పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మదనాపురం: మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ ఉంటుందని తహసీల్దార్ అబ్రహం లింకన్ తెలిపారు. అనంతరం గ్రంథాలయం వద్ద ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ని

క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు



పాన్‌గల్: అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులకు బుధవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం బృందం వైద్యులు డా.హరీశ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యాలయంలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. రక్తశాతం తక్కువగా ఉన్న విద్యార్థులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



పెబ్బేరు రూరల్: అద్వైత మామిడి రైతుల ఉత్పత్తిదారుల సంస్థ లిమిటెడ్, జీబీ నేచురల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ తరపున మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి కంప్యూటర్ వితరణ చేశారు. బుధవారం వ్యవసాయ అధికారి చంద్రమౌళికి కంపెనీ డెరెక్టర్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కంప్యూటర్ అందజేశారు. కార్యక్రమంలో అద్వైత మామిడి రైతుల ఉత్పత్తిదారుల సంస్థ డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, కోటీశ్వర్‌రెడ్డి, ఏఈఓ ఆంజనేయులు, పుష్పలత పాల్గొన్నారు.

చెక్‌ముఖి ప్రతిభ పోటీలు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల స్థాయిలో, ఆ తర్వాత జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభా పురస్కారాలు అందిస్తారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయలక్ష్మి, శేషయ్య, నాగరాజు, భీముడు, రాందేవ్‌రెడ్డి, యాదగిరి, సంధ్య, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో రైతుసేవా కేంద్రం తనిఖీ



గోపాల్‌పేట: ఆగ్రో రైతుసేవా కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మండల తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని ఖిల్లాఘనపురం మండల వ్యవసాయ అధికారి మల్లయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి ఎరువుల పంపిణీ నిలిపి వేశారని, అవకతవకలు ఏమైనా ఉన్నాయా అని ఉన్నతాధికారులు నివేదిక కోరడంతో బుధవారం తనిఖీలు నిర్వహించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు. అన్నీ సక్రమంగానే ఉన్నాయని ఎటువంటి అవకతవకలు జరగలేదని మండల అధికారులు తెలిపారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతి ఇప్పించండి

ఆత్మకూర్: మండలంలోని దేవరపల్లిలో తాగునీటి ఎద్దడి ఉందని, రైల్వేలైన్ ఉన్న కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కు విన్నవించుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే లైన్ కింద నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతి ఇప్పించాలని కోరారు. సంబంధిత కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడి అనుమతి ఇప్పిస్తానని బండి సంజయ్ హామీనిచ్చినట్లు రేచింతల శ్రీనివాస్, సహదేవ్, ఆంజనేయులు, చెన్నయ్యలు తెలిపారు.

ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ శిబిరం

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో గ్రహణంతో మొర్రి, కాలిన గాయాలు, అవయవాల వంకర్లను సరిచేయుట, జన్యుపరమైన లోపం, శరీరంపై విపరీత వెంట్రుకల నివారణకు ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రీన్స్ లాండ్స్ ఆఫ్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యభూషన్, డాక్టర్ గులాబీ రాణి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రామ్‌కీ ఫౌండేషన్, గ్రీన్స్ లాండ్స్ ఆఫ్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సంయుక్తంగా గురువారం నుంచి ఫిబ్రవరి 5 వరకు క్యాంపును నిర్వహిస్తామన్నారు. సమస్య ఉన్న వారు జనవరి 30 వరకు వారి పేర్లను నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు 78160 79234, 98482 41640, 95424 33427 సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పాతపల్లిలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లికి చెందిన ఎనుముల కరుణాకర్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి చిన్నారెడ్డి తనయుడు ఏఐసీసీ స్టేట్ కోర్డినేటర్ డా.జిల్లెల ఆదిత్యారెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం పంపించగా.. సర్పంచ్ రవీందర్‌నాయుడు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం మృతదేహానికి నివాళులర్పించి నగదును అందించారు.

కిష్టగిరిలో..

వనపర్తి మండలంలోని కిష్టగిరి గ్రామానికి చెందిన పెద్ద ముక్కుల నరేష్ అకస్మాతుగా మృతి చెందాడు. విసయం తెలిసి ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ వనపర్తి టౌన్ అధ్యక్షులు రాములు, జిల్లా యువజన నాయకుడు ఎర్రసాయి ప్రసాద్‌యాదవ్ రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. అలాగే మృతుడి పిల్లల చదువుకు తన వంతు సహయం అందిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న గైడ్ టీచర్, విద్యార్థి

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి భాస్కర్ రాష్ట్ర స్థాయి గణితం, సైన్స్ ఫేయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పల్లా శ్రీనివాసులు బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో గోప్లాపూర్ పాఠశాల నుంచి గణిత విభాగంలో అధునాతన గోడ గడియారం ద్వారా కోణాలను, సమయం, డేటాను లెక్కించడం అనే ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి, గైడ్ టీచర్ బండి శ్రీనును అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ (ఎల్‌బీ) చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని మౌనిక జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో పాటు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యింది. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలోనూ పాల్గొంది. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన మౌనికకు జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. అదేవిధంగా మౌనికను రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు శిక్షణ ఇచ్చిన గైడ్ ఉపాధ్యాయుడు రఘురాంజీ, హెచ్‌ఎం నిర్మలాదేవిని అదనపు కలెక్టర్ ప్రశంసించారు.

బాలికల హక్కులు సాధించేందుకు కృషి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

ఆత్మకూర్: చదువులో బాలికలదే పైచేయిగా ఉందని, బాలికలు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం కొండాపురం బాలరాజు అన్నారు. బుధవారం బాలికల ఉన్నతపాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జీసీఈసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లింగవివక్ష, బాల్యవివాహాలు, ఇంట, బయట బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, టోల్‌ఫ్రీ 1098, ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్, తదితర విషయాల గురించి క్లుప్తంగా అవగాహన కల్పించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ గాయత్రి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. బాలికలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు వాటిని పొందేందుకు ధైర్యం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు పలు రకాల ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ వాణి, ఉపాధ్యాయులు స్వాతి, శిరీష, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, రేవతి, రోజ, అనిత, స్వాతి, పరమేశ్వరి, రాధిక, ఉష, రాణి, రాధ, కౌసల్య, జాన్సీరాణి తదితరులు పాల్గొన్నా రు.

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా మండలంలోని నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరిస్తూ బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు మేఘన, రసజ్ఞ, రచన, సుష్మ, చరణ్య, గీత, పావని, మోహిని, కష్ణవేణి పాల్గొన్నారు.



నెలవిడిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు



శ్రీరంగాపురంలో..

మెడికల్ కాంట్రాక్టు వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి, యూనియన్ నాయకులు తదితరులు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న మెడికల్ కాంట్రాక్టు వర్కర్లకు కనీస వేతనం రూ.15,600 చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిసి యూనియన్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషెంటు కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ తదితర కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులంతా కలిసి యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాల నిర్వహణకు టెండర్ దక్కించుకున్న ఓ వ్యక్తి నిబంధనలను తుంగలో తొక్కి కేవలం రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు తగిన న్యాయం జరగకపోతే సమ్మె తప్పదన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల 5 నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు రంగమ్మ, భాగ్యమ్మ, పద్మ, శివ, సంగీత, సాయి కృష్ణ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్షులను కాపాడుకుందాం

ఆత్మకూర్: పక్షి, జంతు జాతిని కాపాడుకోవాలని, పక్షులకు ఎలాంటి హాని జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సర్పంచ్ ప్రశాంతిరాజు, జీవ వైవిధ్య జిల్లా కోఆర్డినేటర్ మీసాల భరత్, పంచాయతీ కార్యదర్శి సాదత్‌అలీ అన్నారు. బుధవారం మండలంలోని మూలమల్లలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఏషియన్ వాటర్ బర్డ్ సెన్సెస్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని చెరువులో ఉంటున్న పక్షులు ఫొటోలు తీసి లెక్కించే కార్యక్రమం చేపట్టారు. చెరువులో ఎన్నో రకాల పక్షి జాతులు ఉన్నాయని, వందల సంఖ్యలో ఉన్న పక్షులను కాపాడి పర్యావరాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య కమిటీ సభ్యులు ఆంజనేయులు, రంగన్న, దేవన్న, రాములు, ఆనంద్, లక్ష్మణ్, లాలు, మహేష్, వెంకటమ్మ, అనంతమ్మ, శ్వేత తదితరులు ఉన్నారు.



నాణ్యమైన వైద్యసేవలు అందిస్తేనే సత్ఫలితాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవాభావంతో వైద్య సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మండల అభివృద్ధి అధికారి కతలప్ప అన్నారు. మహాసంకల్ప వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం తూంకుంట, వల్లభాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. టీబీ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించడంలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని ఆయన వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, వల్లాభాపురం సర్పంచ్ రవీందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

కొత్తకోట రూరల్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, వపపర్తి జిల్లా అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి విజయ్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దమందడి దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా బి.రాములు, ప్రధాన కార్యదర్శిగా భాగ్యమ్మ, సహాయ కార్యదర్శిగా శాంతమ్మ, ప్రచార కార్యదర్శిగా గీత ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నిక చేయడం సంతోషంగా ఉందని అధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ, సహాయ కార్యదర్శి రామిలి, సుశీల, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి టౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుంటే చాలా ప్రయోజనాలు ఉంటాయని జిల్లా లోక్‌అదాలత్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల పుస్తకాల్లో విద్యార్థులకు న్యాయ శాస్త్రాన్ని చేరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీదేవి, న్యాయమూర్తులు, న్యాయవాదులు కృష్ణయ్య, కవిత, నరేందర్ బాబు, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళి

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం గ్రామంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బస్టాండు వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కర్పూరి ఠాకూర్ జయంతి రోజునే భారతరత్న అవార్డును ప్రకటించడం హర్షించదగినదన్నారు. కార్యక్రమంలో ఆశన్న, లక్ష్మీనారాయణ, వంశీ, యాదగిరి, సత్యనారాయణ, శ్రీకాంత్, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుదవారం మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో బిహర్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఘనపురం కృష్ణ, మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకర్, నారాయణదాసు, బాలకృష్ణ, పరమేష్, శాంతన్న, నారాయణదాసు, పరశురాం, ఎల్లస్వామి పాల్గొన్నారు.

అమరచింత: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీ బ్రాహ్మణ ముద్దు బిడ్డ కర్పూరిఠాకూర్‌కు భారత రత్న ప్రకటించడం హర్షణీయమని మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, శివన్న తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అనిల్, రాఘవేంద్ర, జగన్నాథం, మన్యం, మాసన్న, బలరాం, శ్రీను, నారాయణ, రాజు, బాలస్వామి పాల్గొన్నారు.



పెబ్బేరులో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



సోళీపురంలో..

సర్పంచ్‌లకు ఘన సన్మానం



పాన్‌గల్: సర్పంచ్‌ల పదవీకాలం ఈనెల చివరితో ముగియనుండటంతో వారిని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు తోడ్పాటునందించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో కాలనీలు అంధకారం

పెబ్బేరు రూరల్: అప్రకటిత విద్యుత్ కోతల వల్ల వనపర్తి పట్టణంలోని 6 వార్డులోని పలు కాలనీలు అంధకారంలో ఉన్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు బుధవారం వనపర్తిలోని ఎస్‌ఈని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్లగుట్ట, గాయత్రి కాలనీ, మెట్టుపల్లిలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రివేళల్లో విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో పలు లైన్లు పాతవిగా ఉన్నాయని, వాటి మార్చి కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు పరీక్షల సమయం సమీపిస్తుండడంతో కరెంటు కోతలు పెట్టొదన్నారు.